క్లుప్తంగా

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జైల్లో పెడతారా?


మాట్లాడుతున్న వెంకట్

నిజామాబాద్ సిటీ: కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జైల్లో పెడుతున్నారని, ఇది అప్రకటిత ఎమర్జెన్సీని తలపిస్తోందని సీపీఎం కేంద్ర నాయకుడు బి వెంకట్ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని నాందేవ్‌వాడలో ఉన్న సీపీఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు అధ్యక్షతన ఎమర్జెన్సీ నాడు–నేడు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రకటిత ఎమర్జెన్సీని విధిస్తే.. నేటి ప్రధాని అప్రకటిత ఎమర్జెన్సీని కొనసాగిస్తున్నారని అన్నారు. హక్కుల కోసం గొంతెత్తినవారి హక్కులు కాలరాస్తూ అర్బన్ నక్సలైట్లుగా ముద్రవేస్తూ అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతున్నారని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న దేశవ్యాప్తంగా కార్మిక వర్గం తమ చట్టాలను కాపాడుకోవడం కోసం సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నామన్నారు. సదస్సులో నాయకులు వెంకట్రాములు, నూర్జహాన్, శంకర్ గౌడ్, గంగాధర్, అనసూయ, కటారి రాములు, అనిత నరసయ్య, సిర్ప లింగం పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పి సుధాకర్ మాట్లాడుతూ.. కార్మికులకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు టెండర్ విధానాన్ని రద్దుచేసి కార్పొరేషన్ ద్వారా వేతనాలు ఇవ్వాలన్నారు. నాయకులు హైమది, భాగ్యలక్ష్మి, స్వరూప, భారతి, వెంకటేష్, సాయికిరణ్ కార్మికులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

నిజామాబాద్ సిటీ: కార్మిక చట్టాల అమలు కోసం జూలై9న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శంకర్‌గౌడ్, నూర్జహాన్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేయడానికి సిద్ధమైన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. నాయకులు జంగం గంగాధర్, కటారి రాములు, గణేశ్, రమేశ్, నరేశ్, రఫీక్, ముకుంద పాల్గొన్నారు.

బలిపీఠంపై భారత వ్యవసాయరంగం


మాట్లాడుతున్న నాయకుడు కోటేశ్వర రావు

నిజామాబాద్ సిటీ: కేంద్ర ప్రభుత్వం భారత వ్యవసాయ రంగాన్ని బలిపీఠంపై నిలబెడుతోందని అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కోటేశ్వరరావు అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని కోటగల్లి ఎస్ఆర్ భవన్‌లో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు.ఖరీఫ్ సీజన్‌కు ముందుగా సమగ్రమైన పంట ప్రణాళికను ప్రభుత్వం రూపొందించలేదన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో ఆకుల పాపయ్య, దేశెట్టి సాయిరెడ్డి, నర్సయ్య, సాయిలు, నర్సయ్య, శ్రీనివాస్ రెడ్డి,చిన్నయ్య,గోపాల్,విఠల్,బుచ్చన్న, మార్క్స్, బాబురావు, దేవన్న, బన్నీ పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి


నిరసన తెలుపుతున్న కార్మికులు

జక్రాన్‌పల్లి: కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 9న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దాసు పిలుపునిచ్చారు. జక్రాన్‌పల్లిలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. నాయకులు సొప్పరి గంగాధర్, సాయన్న, శేఖర్, రాజన్న, సర్వర్ లక్ష్మి, రేణుక పాల్గొన్నారు.

డ్యూటీ చేయకున్నా జీతాలు

- మున్సిపల్‌లో మాజీ ప్రజాప్రతినిధుల అనుయాయులకు డ్యూటీ మినహాయింపు
- అకౌంట్స్ సెక్షన్‌లో చేతులు తడిపితే చాలు
- బల్దియాకు భారంగా మారుతున్న కొందరు



నిజామాబాద్ సిటీ: ఎక్కడైనా పనిచేస్తేనే జీతం వస్తుంది. కానీ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మాత్రం కొందరికి పనిచేయకున్నా వేతనం మాత్రం ఠంచన్‌గా తమ ఖాతాల్లో జమ అవుతోంది. కార్పొరేషన్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో పాటు కొందరు పర్మినెంట్ ఉద్యోగులు సైతం మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పుడో రావడం రిజిష్టర్‌లో సంతకం చేయడం, వెంటనే వెళ్లిపోవడం నిత్యతంతుగా మారుతోంది.

అవుట్ సోర్సింగ్‌లో ముదుర్లు

మున్సిపల్‌లో విధులు నిర్వహించేవారు 1,570 మంది. వీరిలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు 1,220 మంది. పర్మినెంట్ ఉద్యోగులు కేవలం 350 మంది మాత్రమే. మిగతా వారంతా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ఏజెన్సీల ద్వారా నియామకమయిన వారు. బల్దియాలో కొంతమంది పదేళ్లకు పైగా పని చేస్తున్నవారు సైతం ఉన్నారు. కొందరు అధికారులు, కిందిస్థాయి సిబ్బంది ఆఫీసులో కంటే బయటనే ఎక్కువగా కనిపిస్తుంటారు. కొందరైతే రియల్ ఎస్టేట్‌లో బిజీగా ఉంటున్నారు. డ్యూటీకి రాకున్నా వారి స్థానంలో మరొకరు సంతకం చేస్తున్నారు. పనుల కోసం వచ్చినవారు అడిగితే సార్ ఇప్పుడే బయటకు వెళ్లారంటు కిందిస్థాయి సిబ్బంది సమాధానం చెబుతున్నారు.

మాజీల వద్ద పనిచేసిన వారికి..

మున్సిపల్ కార్పొరేషన్‌లో తాజా మాజీ ప్రజాప్రతినిధుల వద్ద గతంలో సహాయకులుగా పనిచేసిన వారు పదుల సంఖ్యలో ఉన్నారు. వీరంతా ఒకప్పుడు ప్రజాప్రతినిదుల ఇళ్లలో, వారి వెంట పీఏలుగా, సహాయకులుగా పనిచేసినవారే. ప్రస్తుతం పాలకమండలి లేకపోవడంతో వారంతా బల్దియాలో ఏదో ఒక చోట సెట్ అయ్యారు. వారికి డ్యూటీలు మినహాయంపు తెచ్చుకున్నారు. ప్రాధాన్యం లేని చోట్ల కూర్చుంటూ నామమాత్రంగా విధులు నిర్వహిస్తున్నారు. రిజిష్టర్‌లో పేర్లు ఉంటాయి. వారి స్థానంలో మరొకరు సంతకం చేస్తారు. కనీసం వారంలో ఒకసారి, నెలలో రెండుసార్లు కూడా వారు కార్యాలయంలో కనిపించరు. వారి వేతనాలు మాత్రం సంబంధిత విభాగాల నుంచి ఫుల్ సాలరీ వెళ్తుంది. అకౌంట్ సెక్షన్‌లో కొందరికి అందులో కొంత వెళ్తున్నట్లు సమాచారం. జోన్లలో పనిచేసేవారు, కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు, డ్రైవర్లు, సహాయకులు ఇలా దాదాపు డజన్ మంది వరకు ఉచితంగా వేతనాలు పొందుతున్నారు. అదే సాధారణ ఉద్యోగులు ఆలస్యంగావస్తే వెంటనే గైర్హాజరు వేస్తారు. వివరణ అడుగుతారు. కానీ వీరికి మాత్రం స్పెషల్. వీరిని టచ్ చేసే సాహసం ఎవరూ చేయడం లేదు. వీరిని అధికారులు ప్రశ్నిస్తే వెంటనే బడా నాయకులు, మాజీ ప్రజాప్రతినిదుల నుంచి బెదిరింపు ఫోన్లు. ఎక్కువ మాట్లాడితే కులం పేరు, యూనియన్ పేర్లు వాడుతున్నారు. తలాపాపం తిలా పిడెకుడు అన్నట్లు ఈ పాపాన్ని కమిషనర్ కిందిస్థాయి సిబ్బంది మోస్తూనే ఉన్నారు. దాంతో వీరి ఆటలు సాగుతున్నాయి.

కమిషనర్ దృష్టికి..

బల్దియాలో ఎనిమిది మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు విధులకు రాకున్నా వారు ఫుల్ సాలరీ పొందారు. కొందరు సెలవు పెట్టి వెళ్లిన వారికి కూడా ఫుల్ సాలరీ వేశారు. కొంత మంది సాలరీ విషయంపై కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అయితే కమిషనర్ మందలించి వదిలేశారు. దీంతో ప్రతి నెలా ఇదే తంతు కొనసాగుతోంది.

తప్పుడు రిపోర్టు ఇస్తే చర్యలు



ప్రతి ఉద్యోగి ప్రజలకు జవాబుదారీగా వహించాలి. విధులకు రాకుంటే సెలవు ఇవ్వాలి. కొందరు డ్యూటీకి రాకున్నా వేతనాలు తీసుకుంటున్నట్లు నా దృష్టికి వచ్చింది. అకౌంట్ సెక్షన్ నుంచి వివరణ అడిగాను. అటువంటి వారిని ఉపేక్షించం. చర్యలు తప్పవు.

– దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్

నగర రోడ్లపై నడక కష్టమే


ఖలీల్‌వాడిలోని ఫుట్‌పాత్‌పై ఓ ఆస్పత్రి నిర్వాహకులు వేసిన కుర్చీలు


హరిచరణ్ కాంప్లెక్స్ ముందు పార్కింగ్ చేసిన వాహనాలు


బస్టాండ్ ప్రాంతంలో రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్న ఆటోలు

నగరంలోని రోడ్లపై నడక కష్టంగా మారింది. ద్విచక్ర వాహనాలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బస్టాండ్‌లో ఆటో స్టాండ్‌ల కోసం ఏర్పాటు చేసిన ప్రాంతంలో కాకుండా ఆటోవారు నడి రోడ్డుపైనే ఆటోలను నిలుపుతున్నారు. నగరంలో రద్దీ ప్రాంతాలైన ఖలీల్‌వాడి, బస్టాండ్, గాంధీచౌక్ ప్రాంతాల్లో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. ఖలీల్‌వాడిలోని ఓ డాక్టర్ ఫుట్‌పాత్‌పై రోగుల కోసం కుర్చీలు వేయించారు. ఫుట్‌పాత్‌లను వ్యాపారులు ఆక్రమించడంతో రోడ్లపై నడిచేవారికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించి, రోడ్లపై వాహనాలను నిలుపకుండ చూడాలని నగరవాసులు కోరుతున్నారు.


గాంధీచౌక్ వెళ్లే దారిలో..

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్– నిజామాబాద్


తిలక్‌గార్డెన్ కాంప్లెక్స్ రోడ్డులో..


రాష్ట్రపతి రోడ్డులో పార్కింగ్ చేసిన వాహనాలు

మత్తుపదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు


డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న సీఐ వినోద్‌రెడ్డి


మోపాల్‌లో మాట్లాడుతున్న ఎస్సై యాదగిరి గౌడ్


సిరికొండలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై రామ్

డిచ్‌పల్లి: జాతీయ రహదారి వెంట ఉండే దాబా హోటళ్లలో మత్తుపదార్థాలు, మద్యం విక్రయిస్తే హోటళ్ల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని డిచ్‌పల్లి సీఐ వినోద్ రెడ్డి హెచ్చరించారు. సీపీ ఆదేశాల మేరకు బుధవారం డిచ్‌పల్లి పీఎస్ ఆవరణలో సర్కిల్ పరిధిలోని దాబా హోటళ్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. దాబా హోటల్ నిర్వాహకులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను అమర్చుకోవాలన్నారు. గుర్తు తెలియని వారికి తమ హోటల్లో పనిచేయడానికి అవకాశం కల్పించవద్దని సూచించారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి, ఇందల్వాయి ఎస్సైలు ఎండీ షరీఫ్, మాలిక్ రెహమాన్, సందీప్, పోలీసు సిబ్బంది, దాబా హోటళ్ల యజమానులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

మోపాల్: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై యాదగిరిగౌడ్ సూచించారు. బుధవారం మండలంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకులంలో మత్తుపదార్థాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మత్తుపదార్థాలకు బానిసై అనేకమంది విద్యార్థులు, యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై నాగభూషణం, ప్రిన్సిపాల్ మురళీ, ఏటీపీ సుధాం, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

సిరికొండలో..

సిరికొండ: గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలను ఎవరూ వినియోగించవద్దని ఎస్సై ఎల్ రామ్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో, పెద్దవాల్గోట్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామస్తులు, విద్యార్థులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



సిరికొండ: నూతనంగా ఏర్పడిన ఆలిండియా బంజారా సేవా సంఘం కార్యవర్గ నాయకులు ఎమ్మెల్యే భూపతిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన అధ్యక్షుడు రూప్‌సింగ్‌తో పాటు కార్యవర్గాన్ని ఎమ్మెల్యే సన్మానించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, ఎర్రన్న, సంతోష్‌నాయక్, శివాజీ నాయక్, చందర్‌నాయక్, రవినాయక్, మోజీరాం, జీవన్, మోహన్, మోహన్‌లాల్, బాల్‌సింగ్, మాలావత్ రవి తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ కన్వీనర్‌గా గంగాధర్



డిచ్‌పల్లి: ఆర్మూర్‌లో నిర్వహించిన తెలంగాణ ప్రాంత అభ్యాస వర్గలో ఏబీవీపీ దిల్‌సుఖ్‌నగర్(హైదరాబాద్) జోన్ కన్వీనర్‌గా తెలంగాణ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి గంగాధర్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి ప్రకటించారు. బుధవారం మాక్లూర్ మండలం గాలిబ్‌నగర్ గ్రామానికి చెందిన గంగాధర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు విద్యార్థుల పక్షాన విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తానని పేర్కొన్నారు.

సారంగపూర్ పాఠశాల తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న ప్రేమలత

నిజామాబాద్‌రూరల్: సారంగపూర్‌లోని ప్రాథమిక, జెడ్పీ హైస్కూల్, శిశు గృహాన్ని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ప్రేమలత అగర్వాల్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి అందుతున్న సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాగా చదివి మంచి స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. జిల్లా సంక్షేమాధికారి షేక్ రసూల్ బీ, జిల్లా బాలల రక్షణ అధికారి చైతన్య కుమార్, ఎంఈవో, హెచ్ఎం, బాలసదనం సూపరింటెండెంట్, సిబ్బంది ఉన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు డాక్టర్ విశాల్



నిజామాబాద్‌నాగారం: బ్రిటన్‌లో జూలై 5, 6వ తేదీల్లో నిర్వహించే బ్రిటిష్ ఇండియన్ సైకియాట్రిక్ అసోసియేషన్ వార్షిక సదస్సుకు జిల్లాకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ విశాల్ ఆకుల వక్తగా వెళ్లనున్నారు. భవిష్యత్ మానసిక ఆరోగ్యం, సమన్వయం, ప్రభావం అనే థీమ్‌తో నిర్వహించబడుతున్న ఈ అంతర్జాతీయ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ మానసిక ఆరోగ్య నిపుణులు హాజరు కానున్నారు. ఇందులో డాక్టర్ విశాల్ అడిక్షన్ సైకియాట్రిలో ఆవిర్భవిస్తున్న ధోరణులు అనే వర్క్‌షాప్‌లో ప్రసంగించనున్నారు. సదస్సులో అంతర్జాతీయ ఖ్యాతిగల సంస్థల నిపుణులు కూడా పాల్గొననున్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు తాటికొండ రవి, మాదం తిరుపతి అన్నారు. బుధవారం భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యారంగ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించేందుకు నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాగరాజు, పెద్ది సూరి, మహేశ్, గణేశ్, ప్రశాంత్, రాజు, విశాల్, శివ, అభిషేక్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు అప్పగించాలి


మాట్లాడుతున్న వెంకట్

నిజామాబాద్ అర్బన్: కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు, ఎంఈవోలకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు కొంగల వెంకట్ అన్నారు. బుధవారం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల పనితీరును పర్యవేక్షించడానికి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులను, స్కూల్ అసిస్టెంట్లను నియమించాలని విద్యాశాఖ నిర్ణయించడం శోచనీయమని అన్నారు. సమావేశంలో కేశపురం రమేష్ మల్లమారి మల్లికార్జున్, రాష్ట్ర బాధ్యులు రాజన్న, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడి హేయమైన చర్య



ధర్పల్లి: కామారెడ్డి జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు బాలకృష్ణపై జరిగిన దాడి హేయమైన చర్య అని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పీఆర్‌టీయూ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను మందలించినందుకు ప్రభుత్వ ఉపాధ్యాయుడి పై దాడి చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ఇకపై ఇలాంటి దాడులలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కిషన్, వెంకట రాజారెడ్డి, సతీశ్, అంకం నరేశ్, శ్రీనివాస్, లింగారెడ్డి, నర్సిరెడ్డి, సత్యనారాయణ, ప్రసన్న, వెంకటరామయ్య, రవి రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల సరఫరాపై సమీక్ష

బోధన్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు ఎరువుల సరఫరా అంశం పై బుధవారం నవీపేట మండల కేంద్రంలోని సొసైటీలో నవీపేట, ఎడపల్లి, రెంజల్ మండలాల పరిధిలోని సొసైటీల సీఈవోలతో డీసీవో శ్రీనివాస్‌రావు సమీక్ష సమావేశం నిర్వహించారు. పంట దశ, సాగు భూమి విస్తీరణం మేరకు రైతులకు ఎరువులు సరఫరా చేయాలని సూచించారు. ఏడీఏ అలీం అహ్మద్, మండల వ్యవసాయశాఖ అధికారి నవీన్‌కుమార్, సొసైటీల సీఈవోలు పాల్గొన్నారు.

జీపీని తనిఖీ చేసిన డీఎల్‌పీవో



బాల్కొండ: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీని డీఎల్‌పీవో శివకృష్ణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జీపీ రికార్డులను పరిశీలించారు. గ్రామంలో ఇంటి నిర్మాణాల అనుమతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీవో గంగామోహన్, ఈవో రజనీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో బుక్య లింగం నాయక్

డిచ్‌పల్లి: మండలంలోని వివిధ గ్రామాలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని డిచ్‌పల్లి ఎంపీడీవో బుక్య లింగం నాయక్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలా మంది లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులకు ముందుకు రావడం లేదని, పంచాయతీ కార్యదర్శులు వారితో మాట్లాడి ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. వానాకాలం ప్రారంభమైనందున త్వరలో చేపట్టనున్న వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో మంజుల, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ సుధాకర్‌రెడ్డి, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.


సీతాయిపేట్‌లో ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

ధర్పల్లి: మండలంలోని సీతాయిపేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీవో బాల కృష్ణ, హౌసింగ్ ఏఈ అనూష బుధవారం పరిశీలించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వే గవంతంగా పూర్తి చేయాలని, నిబంధనల ప్ర కారమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని అధికారు లు లబ్ధిదారులకు సూచించారు. ఇప్పటి వరకు నిర్మాణం చేపట్టిన వారికి లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు జమ చే సినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. జీపీ కార్యదర్శి కృష్ణ కాంత్ ఉన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	98,900	వెండి(కిలో)	1,10,000
22 క్యారెట్స్	91,297		– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	160
		లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	30	క్యాప్సికం	50	90
బెండకాయ	30	50	గాజరుగడ్డ	30	60
జీరకాయ	30	50	పచ్చిమిర్చి	50	80
దొండకాయ	20	40	దోసకాయ	20	40
బీర్నిసుకాయ	70	100	ఆలుగడ్డ	30	50
కాకరకాయ	30	50	గోబిగడ్డ	15	30
వంకాయ	30	60	గోబిపువ్వు	20	40
పాలకూర	80	120	బీట్‌రూట్	30	60
మెంతికూర	60	100	కరివేపాకు	40	60
కొత్తిమీర	30	50	వామగడ్డ	30	50
పుదీనా	60	90	చిక్కుడుకాయ	40	70

–సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)
స్క్రీన్-1 కుబేర(తెలుగు)-1.30, 7.30
స్క్రీన్-2 కుబేర(తెలుగు)-11.00, 4.20, 10.30
స్క్రీన్-3 8 వసంతాలు -4.30, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
స్క్రీన్-1 ఎలియో(3డీ తెలుగు)-10.15
ఎలియో(3డీ ఇంగ్లీష్)-4.20
కుబేర(తెలుగు)-12.40, 6.45, 10.25
స్క్రీన్-2 హౌ టు ట్రైన్ యువర్ డ్రాగన్ (3డీ తెలుగు)-10.05 గు)-10.05
8 వసంతాలు(తెలుగు)-12.50
కుబేర(తెలుగు)-3.45
సితారే జమీన్ పర్(హిందీ)-7.25, 10.50
స్క్రీన్-3 కుబేర(తెలుగు)-10.00
సితారే జమీన్ పర్(హిందీ)-1.40
బాలేరినా(తెలుగు)-5.05
28 ఇయర్స్ లేటర్(ఇంగ్లీష్)-7.50
సితారే జమీన్ పర్(తెలుగు)-10.30
స్క్రీన్ -4 సితారే జమీన్ పర్ -10.05, 4.10
28 ఇయర్స్ లేటర్(ఇంగ్లీష్)-1.30
8 వసంతాలు(తెలుగు)-7.35, 10.30

విజయ్ కుబేర దేవి సితారే జమీన్ పర్
నటరాజ్ సితారే జమీన్ పర్ (హిందీ)
లలితామహల్ 8 వసంతాలు